సాక్షి ప్రకాశం

సోమవారం । 11 । ఆగస్టు । 2025



పూలరైతు వాడిపోయి..
కంభం మండలం రావిపాడులో గతంలో 300 ఎకరాలకు పైగా మల్లె, జాజి తోటలు ఉండేవి. తోటలకు తెగుళ్లు, వైరస్‌లతో 50 ఎకరాలకు పడిపోయింది. - 8లో..



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక
రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం ఒంగోలులోని ఎస్‌పీకేఆర్ పాఠశాలలో నిర్వహించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఇంటర్ విద్యలో సుబ్బారావు సేవలు ఎనలేనివి



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యలో వివిధ హోదాల్లో సముచిత సేవలందించి వాటికి వన్నె తెచ్చిన వ్యక్తి వంగపల్లి వెంకట సుబ్బారావు అని ఇంటర్ విద్య ఆర్‌జేడీ జె.పద్మ, ఇంటర్ బోర్డు సీఓఈ ఎ.సైమన్ విక్టర్, ఓఎస్డీ వి.రమేశ్ అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేస్తూ, నెల్లూరు డీఐఈఓ గా జూలై 31న ఉద్యోగ విరమణ చేసిన సుబ్బారావుకు ఆదివారం ఒంగోలు ఏకేవీకే జూనియర్ కళాశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారు అతిథులుగా మాట్లాడారు. లెక్చరర్ గా, ప్రిన్సిపాల్ గా, ప్రకాశం జిల్లా ఆర్ఐఓగా, గుంటూరు ఆర్‌జేడీగా, పరీక్షల నియంత్రణ అధికారిగా, నెల్లూరు జిల్లా ఇంటర్ విద్య అధికారిగా వివిధ హోదాల్లో ఆయన అందించిన సేవలు నిరుపమానం అన్నారు. ఇంటర్ విద్య సంస్కరణల్లో ఆయన కీలక భూమిక పోషించారని ప్రశంసించారు. ఆయన పనితీరు అందరికీ మార్గదర్శకం అన్నారు. సుబ్బారావు, భారతి దంపతులను ఘనంగా సన్మానించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి కే ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్రంలోని డీఐఈఓలు, ఆర్ఐఓలు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం



జిల్లా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు నెలలో రెండో ఆదివారం పుస్తక సమీక్ష మంచికంటి వెంకటేశ్వర రెడ్డి నిర్వహించారు. జాలాది మోహన్బాబు విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. నలుగురు విద్యార్థులకు జిల్లా గ్రంథాలయంలో సభ్యత్వం నమోదు చేసుకున్నారు. విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ పెట్టి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి డీసీఎల్ సిబ్బంది, డీ సందీప్, గోవిందమ్మ పాల్గొన్నారు.

రైతుసేవ.. దూరం దూరం

రైతులను అన్ని విధాలా వంచిస్తున్న కూటమి ప్రభుత్వం అరకొరగా అందుతున్న ప్రభుత్వ సేవలను కూడా రైతుసేవా కేంద్రాల విలీనంతో వారికి దూరం చేస్తోంది. రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరుమార్చిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా వాటిని క్రమంగా ఎత్తేసేందుకు కుట్రలు చేస్తోంది. సొంత భవనాలు ఉన్న వాటిని కూడా విలీనం పేరుతో సమీప గ్రామాల్లోని కేంద్రాల్లో కలిపేస్తోంది. దీంతో ఇప్పటి దాకా ఉన్న ఊరిలోనే సేవలు పొందిన రైతులు ఏ చిన్న అవసరం వచ్చినా సుదూర ప్రాంతాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

- రైతుసేవా కేంద్రాలపై విలీనం పిడుగు
- విలీనం పేరుతో రైతుసేవా కేంద్రాల కుదింపు
- మిగిలిన సిబ్బంది ఇతర జిల్లాలకు బదిలీ
- పనిభారం పెరుగుతుందంటున్న వీఏఏలు
- ఎరువులు, విత్తనాల కోసం రైతులు పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి



విలీనంలో భాగంగా తొలగించిన కంభం-3 రైతు సేవా కేంద్రం



ఎరువులు తెచ్చుకోవాలంటే దూరం వెళ్లాల్సి వస్తోంది



గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని తొలగించి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎల్‌కోటలో విలీనం చేశారు. ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలంటే దూరమవడంతో పాటు రవాణా ఖర్చులు అధికంగా అవుతాయి. ఏదైనా సమస్య వచ్చి వ్యవసాయ శాఖ సిబ్బందిని అడగాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తుంది.
– గొంగటి రామిరెడ్డి, రైతు, జంగంగుంట్ల, కంభం మండలం

గ్రామంలోనే కొనసాగించాలి



గ్రామంలో రైతు సేవా కేంద్రానికి సొంత భవనం ఉన్నప్పటికీ తొలగించి పాపినేనిపల్లిలో విలీనం చేశారు. పొలాలకు ఎరువులు తీసుకోవాలంటే 5 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. గ్రామంలోనే రైతుసేవా కేంద్రాన్ని కొనసాగించేలా చూడాలి.
– సిద్దారెడ్డి ఓబుల్ రెడ్డి, రైతు, బొల్లుపల్లి, అర్ధవీడు మండలం

జిల్లాలో ఏర్పాటైన రైతు సేవా కేంద్రాలు: 584
విలీనం చేసిన కేంద్రాలు: 88
ప్రస్తుతం ఉన్న రైతు సేవా కేంద్రాలు: 496

కంభం:

రైతులు వారి గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు తీసుకునేందుకు, ఇతర సమస్యలు పరిష్కరించుకోవడం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల పరిధిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించడం ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరుమార్చేసింది. ఏడాదిగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేసిన కూటమి ప్రభుత్వం వాటి సంఖ్యను తగ్గించేసింది. జిల్లాలో గిద్దలూరు, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ సబ్‌డివిజన్ లు ఉండగా వాటి పరిధిలో 584 రైతు సేవా కేంద్రాలున్నాయి. విలీనం పేరుతో 88 రైతు సేవా కేంద్రాలను మరో రైతు సేవా కేంద్రాల్లోకి కలిపేయడంతో ప్రస్తుతం 496 కు చేరుకున్నాయి. దీంతో రైతు సేవాకేంద్రాలు తొలగించిన గ్రామాల్లోని రైతులు పక్క గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

రైతులకు తప్పని తిప్పలు

కొన్ని ప్రాంతాల్లో గ్రామాలకు ఆనుకొని పంటపొలాలు ఉన్నా ఇలాఖా పరంగా అవి ఇతర గ్రామాల్లో ఉన్నాయి. అధికారులు వాటిని ప్రామాణికంగా తీసుకోకుండా విలీనం చేయడంతో రైతులు తమ అవసరాల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంభం మండలం జంగంగుంట్ల రైతు సేవా కేంద్రాన్ని 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్‌కోట రైతుసేవా కేంద్రంలో విలీనం చేయడంతో అక్కడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే విధంగా జిల్లాలో పలు చోట్ల రైతు భరోసా కేంద్రాలను విలీనం చేయడంతో రైతులు 5 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఈ–క్రాప్ ఆధారంగా విలీనం:

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చేసిన ఈ క్రాప్ బుకింగ్‌లను ప్రామాణికంగా తీసుకొని రైతు సేవా కేంద్రాలను విలీనం చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ చేసిన విస్తీర్ణానికి, పూర్తి విస్తీర్ణానికి వ్యత్యాసం ఉంటుందని, అలాంటప్పుడు దాన్ని ప్రామాణికంగా ఎలా తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పనిభారం పెరుగుతుందంటున్న వీఏఏలు:

వీఆర్వోలు, సర్వేయర్లను మాత్రం సచివాలయాల వారీగా అలాగే ఉంచి కేవలం వీఏఏలను మాత్రమే విలీనం చేయడం అన్యాయమని వారు వాపోతున్నారు. విలీనం చేసిన నేపథ్యంలో మిగిలిన వీఏఏలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ క్రాప్ ఆధారంగా రైతు సేవా కేంద్రాలను విలీనం చేసి తిరిగి ఇప్పుడు ఏరియా మొత్తాన్ని ఈ క్రాప్ చేయమని చెబుతుండటంతో పని భారం పెరుగుతుందని వీఏఏలు వాపోతున్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో విఫలమైన ప్రభుత్వం ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలను విలీనం పేరుతో తగ్గించి వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది.
– నెమలిదిన్నె చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్‌వింగ్ సెక్రటరీ

ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనాలు ఇవ్వాలి



ప్రైవేటు ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు సూర్యారావు

ఒంగోలు టౌన్: ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యారావు డిమాండ్ చేశారు. మంగమూరు రోడ్డులోని శ్లోక ట్యూషన్ సెంటర్‌లో ఆదివారం పీటీఎల్‌పీడబ్ల్యూఏ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు వై.సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రెండున్నర లక్షల మందికి పైగా ప్రైవేటు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. అరకొర జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని చెప్పారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యపోరాటాలు చేయడం మినహా మరే మార్గంలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.రవి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మధ్య బోధనలోనూ, ఫలితాల్లోనూ వ్యత్యాసమేమీ ఉండదని చెప్పారు. వేతనాల్లో మాత్రం భారీగా తేడా ఉంటోందన్నారు. ఆ అంతరాన్ని తొలగించి ప్రైవేటు ఉపాధ్యాయులు కూడా గౌరవ ప్రదమైన వేతనాలతో జీవితాన్ని గడిపేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఉపాధ్యాయుల పోరాటాలకు యూటీఎఫ్ తమ వంతు సహకారం అందజేస్తుందని చెప్పారు. డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు మాట్లాడుతూ... డీఎస్సీ అభ్యర్థుల పోరాటానికి ఎలాంటి సహకారం అందించామో, అదే తరహాలో ప్రైవేటు ఉపాధ్యాయుల పోరాటాలకు మద్దతునిస్తామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టి.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి యూ.కిరణ్ పాల్గొన్నారు.



తలపై బోనాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

వానమ్మా.. రావమ్మా!

- సకాలంలో వర్షాలు కురవాలని పోలేరమ్మ, అంకాలమ్మకు బోనాలు

పెద్దదోర్నాల: సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలోని ఐనముక్కలలో గ్రామస్తులు పోలేరమ్మ, అంకాలమ్మలకు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి సకాలంలో వర్షాలు కురవక ఏరువాక సాగని ప్రస్తుత తరుణంలో వర్షాలు బాగా పడాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని మొక్కుకుని పోలేరమ్మ తల్లికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పోలేరమ్మకు కుంకుమ బండిని అందంగా అలంకరించి గ్రామంలో కొమ్ము బూరాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో మహిళలు వారు పోసి పోలేరమ్మ కుంకుమబండికి స్వాగతం పలికి తలపై బోనాలతో సమీపంలోని పోలేరమ్మ తల్లి గుడికి చేరుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజల్లో మూఢ నమ్మకాలు తొలగిస్తాం

మార్కాపురం: ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జేవీవీ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన వెంకట్రావు తెలిపారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జేవీవీ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో యూటీఎఫ్ నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసే దిశగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, కాశయ్య, శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రావు

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయండి



మొవ్వవారిపాలెంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: ఓట్ల కోసం మభ్యపెట్టేందుకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును, టీడీపీ నాయకులను నిలదీయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మండలంలోని గోనుగుంట మొవ్వవారిపాలెం, కేవీ పాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మేరుగు నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. కోవిడ్ వల్ల రాష్ట్ర ఆదాయం పూర్తిగా దిగజారినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న సంకల్పంతో అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్మును పేదల బ్యాంక్ ఖాతాలకు జమ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అయితే ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదైనా పింఛన్ల సంఖ్యలో భారీగా కోత పెట్టి పెంచడంతో పాటు, అరకొరగా తల్లికి వందనం పథకాన్ని మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకుందన్నారు. ఇచ్చిన పథకాల గురించి ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించేలా ప్రభుత్వం తయారైందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు, శ్రీధర్ల శేషు, యూత్ అధ్యక్షుడు వెంగరెడ్డి, జిల్లా కార్యదర్శి ఓబుల్ రెడ్డి, నల్లూరి చంద్ర, తన్నీరు శ్రీనివాసరావు, బొడ్డు కోటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటరావు, ఎర్రగుంట్ల మోహన్, వసంతరావు, ఏలూరు సురేష్, పేరాబత్తిన పేరయ్య, వాకా కోటిరెడ్డి, కందుల డేనియల్, పాటిబండ్ల గంగయ్య, సంతోష్, మగులూరి ఇమ్మనేలు, బొడ్డపాటి హరిబాబు మండలంలోని పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

13న క్విట్ కార్పొరేట్ నినాదంతో ర్యాలీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకుడు చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: జాతీయోద్యమంలో బ్రిటిష్ ముష్కరులను దేశం నుంచి తరిమికొట్టేందుకు నిర్వహించిన క్విట్ ఇండియా పోరాటం స్ఫూర్తితో ఈ నెల 13వ తేదీ ఒంగోలు నగరంలో క్విట్ కార్పొరేట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక ఎల్బీజీ భవనంలో ఆదివారం రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో పడేసి, రైతులను దివాలా తీయడం ద్వారా తన లక్ష్యాన్ని సాధించుకునేందుకు అనేక చట్టాలను తీసుకొస్తుందని చెప్పారు. మోదీ కుట్రలకు వ్యతిరేకంగా దేశంలోని రైతు సంఘాలు, రైతులు, కార్మికులు కలిసి పోరాటాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 83 ఏళ్ల క్రితం చేపట్టిన క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని మినీ స్టేడియం వరకు ట్రాక్టర్లు, మోటారు బైకులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని ప్రజలు ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతి బాబు అధ్యక్షత వహించగా ఎస్ లలిత కుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కోడూరు హనుమంతరావు, కొండ్రు గుంట సుబ్బారావు, జీవీ కొండారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, ఇరిగినేని వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణంలో వైఖానస ఆగమ శాస్త్ర పండితులు

నేత్రపర్వంగా శ్రీనివాసుని కళ్యాణం

- ఘనంగా ముగిసిన వైఖానస సర్వసభ్య సమావేశం

ఒంగోలు మెట్రో: విఖనసాచార్యుల జయంతి మహోత్సవాన్ని ఒంగోలులోని వైఖానస భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వైఖానస సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విఖనస జయంతి మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రాంగణంలో టీటీడీ పండితుడు పరాంకుశం కృష్ణసాయి భట్టర్ ఆధ్వర్యంలో విశేష క్రతువులను ద్విసహస్ర కళ్యాణ చక్రవర్తి, త్రినాథ చక్రవర్తి ఆధ్వర్యంలో శ్రీనివాసుని కళ్యాణోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. డాక్టర్ పి.హరిబాబు బృందం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పరాంకుశం కేశవాచార్యులు, గౌరవాధ్యక్షుడు గంజాం శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శి పి.ఆత్రేయ, కోశాధికారి ఉపాళ్ల రాంబాబు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి, గౌరవ సలహాదారు యం.ఎ.శేషాచార్యులు, కార్యవర్గ సభ్యులు దివి కళ్యాణ చక్రవర్తి, రమణదీక్షితులు. దివి కస్తూరి రంగాచార్యులతో పాటుగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పలువురు వైఖానస పండితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కొండపి: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని పెద్ద కండ్లకుంటలో ఆదివారం జరిగింది. ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పాలపర్తి రాజశ్రీ (29) కొన్నేళ్ల క్రితం పాలపర్తి పోతురాజును ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త తరుచూ మద్యం తాగి వస్తుండటంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన అత్త చూసేసరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొండపి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

ముగిసిన శ్రీగిరి పవిత్రోత్సవాలు


స్నపన తిరుమంజనంలో వేద పండితులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు శ్రీగిరి వెంకటేశ్వర స్వామికి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను భక్తులు ప్రత్యక్షంగా తిలకించారు. తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో హోమ క్రతువులతో పాటు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీగిరి శ్రీవారి పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార్ ఆత్రేయ, ఆలూరు ఫణికుమార్ తదితరులు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు,

ఎఫ్‌ఏ-1 ప్రశ్నపత్రాలు సీఆర్పీల ద్వారా చేర్చాలి

ఒంగోలు సిటీ: ఎఫ్ఏ-1 ప్రశ్న పత్రాలు సీఆర్పీల ద్వారా పాఠశాలలకు చేర్చాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు క్లస్టర్‌కు, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎమ్మార్సీ సెంటర్లకు వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకువెళ్లాలని మండల విద్యాశాఖ అధికారులు ఆదేశాల జారీ చేశారని తెలిపారు. జిల్లాలో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయన్నారు. కొన్ని పాఠశాలలు మండల కేంద్రానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, పాఠశాలను వదిలి పరీక్ష పేపర్లకు వెళ్లటం వల్ల చాలామంది మహిళా ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయుల విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారు మండల కేంద్రాలకు వెళ్లేందుకు సమయం చాలదు కనుక కాంప్లెక్స్‌ల్లో ప్రశ్నపత్రాలు చేర్చి సీఆర్పీల ద్వారా పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు.

బీచ్‌లో యువకుడిని కాపాడిన మెరైన్ సిబ్బంది


108లో హేమంత్‌ను తరలిస్తున్న మెరైన్ సిబ్బంది

కొత్తపట్నం: స్థానిక పల్లెపాలెం బీచ్‌లో ఓ యువకుడు గల్లంతయ్యే సమయంలో మెరైన్ సిబ్బంది కాపాడారు. ఒంగోలు నగరానికి చెందిన ఎం.హేమంత్ మరో ముగ్గురు యువకులతో కలిసి ఆదివారం కావడంతో సముద్రస్నానానికి బీచ్‌కి వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల ఉధృతికి నీటిలో మునిగిపోయి హేమంత్ గల్లంతవుతున్నాడు. సముద్రతీరంలో విధులు నిర్వర్తిస్తున్న మెరైన్ హోంగార్డులు శ్రీరాములు, కృష్ణ వెంటనే స్పందించి అలలకు ఎదురెళ్లి అతి కష్టం మీద హేమంత్‌ను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అతను నీరు మింగి ఊపిరాడక స్పృహతప్పిపోయాడు. కడుపు నొక్కి నీటిని బయటకు కక్కించిన మెరైన్ సిబ్బంది.. కొన ఊపిరితో ఉన్న హేమంత్‌ను 108 అంబులెన్స్ పిలిపించి ఆక్సిజన్ పెట్టించి కొత్తపట్నంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది చికిత్స చేయడంతో హేమంత్ సురక్షితంగా బయటపడ్డాడు. దీంతో అతని తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఊపిరి పీల్చుకుని మెరైన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బందిని సీఐ ఎస్.సాంబశివరావు, ఎస్సై పి.సుబ్బారావు అభినందించారు.


సాగులో ఉన్న మల్లె తోట



పూలు కోస్తున్న కూలీలు

తెగుళ్లు, పెట్టుబడులు పెరిగిపోయి..

పూల రైతు వాడిపోయి..!

పట్టించుకోని ఉద్యానవన శాఖాధికారులు...

- కంభం మండలం రావిపాడులో గతంలో 300కుపైగా ఎకరాల్లో మల్లె, జాజి తోటల సాగు
- తోటలకు తెగుళ్లు, వైరస్‌లతో ప్రస్తుతం 50 ఎకరాలకు పడిపోయిన వైనం
- పెరిగిన పెట్టుబడులు కూడా మరో కారణం
- కన్నెత్తిచూడని ఉద్యానవన శాఖాధికారులు
- నష్టపోతున్న రైతులు


మార్కెట్‌కు తరలించేందుకు కవర్లో సిద్ధంగా ఉంచిన జాజి పూలు


మల్లె పూలు

ప్రస్తుతం రావిపాడు గ్రామంలో 50 ఎకరాలకుపైగా మల్లె, జాజి తోటలు సాగులో ఉన్నాయి. తెగుళ్ల, వైరస్‌ల బెడద అధికంగా ఉండటంతో దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చివరకు సాగు విస్తీర్ణం కూడా భారీగా తగ్గిపోయినప్పటికీ ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల అధికారులు ఆ తోటల వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు వాపోతున్నారు. గతంలో చీడపీడల బెడద తక్కువగా ఉండేదని, ఇటీవల అధికమవడంతో దిగుబడి తగ్గిపోయి నష్టాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ అధికారి కూడా తమ పూలతోటలవైపు కన్నెత్తి చూడటం లేదని, ఏ తెగులుకు ఏ మందు వాడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తమకు అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. దుకాణదారులు ఏ మందు చెబితే అది గుడ్డిగా తెచ్చుకొని పొలాలకు వాడుకుంటున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మల్లె సాగులో రైతులకు మెళకువలు నేర్పించడంతో పాటు జాగ్రత్తలు, సూచనలు అందిస్తేనే పూల సాగుకు రైతులు ముందుకొస్తారని చెబుతున్నారు.

కంభం:

మండలంలోని రావిపాడు గ్రామం పేరు వినగానే గుర్తొచ్చేది పూల సువాసనలు. పూల తోటల సాగుకు ఈ గ్రామం పెట్టింది పేరు. ఇక్కడ పండించే మల్లె, జాజి పూలు రాష్ట్ర నలుమూలలకు ఎగుమతి అవుతుంటాయి. వంద సంవత్సరాల క్రితం నుంచే ఈ గ్రామంలో పూలతోటలు సాగు చేస్తూ వస్తున్నారు. పూర్వం బత్తాయి తోటలు సాగు చేస్తూ మధ్యలో అక్కడక్కడా మల్లెపూల చెట్లు వేసేవారు. పూలు బాగా కాస్తూ మంచి రేటుకు అమ్ముడుపోతుండటంతో కాలక్రమంలో పూలతోటలే సాగుచేస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు. గతంలో 300 నుంచి 400 ఎకరాల్లో మల్లె, జాజి పూలతోటలు సాగు చేస్తుండగా, ప్రస్తుతం తెగుళ్ల, చీడపీడలతో పాటు పెరిగిన పెట్టుబడుల కారణంగా సాగు తగ్గుతూ వచ్చి కేవలం 50 నుంచి 60 ఎకరాల్లోనే పూలతోటలు సాగులో ఉన్నాయి.

తమిళనాడు నుంచి అంటు తెచ్చి...

రామేశ్వరం, మధురై, కుంభకోణం నుంచి మల్లె అంట్లు తెచ్చి రావిపాడు గ్రామంలోని పొలాల్లో రైతులు నాటుతారు. మొక్కలు నాటిన తొలి రెండు సంవత్సరాలు చిన్నపిల్లల్లా వాటిని చూసుకుంటారు. రెండేళ్లకు కోతకు వస్తాయి. అప్పటికే ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది.

ఇతర ప్రాంతాలకు రవాణా...

రావిపాడులో పండిన మల్లె, జాజి పూలకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ పండిన పూలు గతంలో మన జిల్లాతో పాటు వినుకొండ, నరసరావుపేట, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. ఇటీవల కాలంలో సాగు తగ్గడంతో ప్రస్తుతం మార్కాపురం, గిద్దలూరు, పోరుమామిళ్ల, పొదిలి, కనిగిరి వంటి ప్రాంతాలకు మాత్రమే పంపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పూలు రూ.150 వరకు ధర పలుకుతున్నాయి.

తెగుళ్లతో తగ్గిపోతున్న దిగుబడి, సాగు విస్తీర్ణం...

మల్లె, జాజి తోటలకు ఎర్రనల్లి తెగులు, ఎర్రమొగ్గ తెగులు, ముడత తెగులు, బొబ్బతెగులు బెడద అధికమవడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఒకసారి నాటిన చెట్లు పదేళ్ల వరకు కాపు కాస్తాయి. నెలకు ఒక కాపు వస్తుండగా, గతంలో కాపునకు సుమారు 100 కేజీల వరకూ దిగుబడి వచ్చేది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా 20 నుంచి 25 కేజీల వరకు దిగుబడి తగ్గిపోయింది. దీంతో క్రమంగా సాగు విస్తీర్ణం కూడా తగ్గింది.


బొబ్బతెగులు సోకి ముడతలు పడిపోతున్న జాజిచెట్ల ఆకులు


తెగుళ్లకు ఎండిపోతున్న మల్లె చెట్లు


జాజిపూల తోట



ఏ మందులు వాడాలో తెలియడం లేదు

మల్లె తోటలకు ఎర్రమొగ్గ, నల్లి తెగుళ్ల బెడద అధికంగా ఉంది. అధికారులెవరూ మల్లెతోటలను పరిశీలించేందుకు రావడం లేదు. తెగుళ్లకు ఏ మందులు వాడాలో తెలియక ఎరువుల కొట్ల వారు ఏ మందు ఇస్తే అది కొనుగోలు చేసి పిచికారీ చేసుకుంటున్నాం. మా పూలతోటలను అధికారులు పరిశీలించి సూచనలిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

షేక్.ఖాసింవలి, రైతు



పెట్టుబడి రావడం లేదు

పూలతోటలకు పెట్టిన పెట్టుబడులకు సరిపడా ఆదాయం కూడా రావడం లేదు. కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. ఆరుగాలం శ్రమించి సాగుచేసుకున్న పంటకు తెగుళ్లు వ్యాపించి దిగుబడి తగ్గిపోవడంతో నష్టాలే మిగులుతున్నాయి. రానురానూ పూలతోటలు సాగుచేయాలంటే భయమేస్తోంది.

భువనగిరి శ్రీనివాసులు, రైతు



ఎకరా పొలంలోనే మల్లె సాగు

గతంలో నాలుగైదు ఎకరాల్లో పూల తోటలు సాగు చేసేవాడిని. ఖర్చులు పెరిగిపోవడం, తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోతుండటంతో ప్రస్తుతం ఎకరా పొలంలోనే సాగు చేస్తున్నా.

పి.కరీముల్లా, మల్లె రైతు



జాజితోటకు బొబ్బతెగులు సోకింది

0.70 సెంట్లలో జాజితోట సాగు చేస్తున్నా. జాజికి బొబ్బ తెగులు సోకి ఆకులు ముడతలు పడి పూలు కాయడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాను. పెరిగిన పెట్టుబడులకు తోడు తెగుళ్ల బెడద అధికమవడంతో పూల తోటలు సాగుచేయాలంటేనే భయమేస్తోంది.

మద్దుకూరి తిరుపాలు

శంకుస్థాపన సరే..పనులెప్పుడు..?

- సమావేశ మందిరానికి శంకుస్థాపన చేసి 8 నెలలు
- అడుగు ముందుకు పడని పనులు
- ఉన్నతాధికారుల సమావేశాలకు భారంగా అద్దె చెల్లింపు


శంకుస్థాపన చేసిన స్థానంలో పిచ్చిమొక్కలు మొలిచిన దృశ్యం

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశాల నిర్వహణ కోసం భవన నిర్మాణానికి గత ఏడాది నవంబర్‌లో సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసి 8 నెలలు దాటినా ఇంత వరకు పనులు అడుగు ముందుకు పడలేదు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.55 లక్షలు కేటాయించింది. అయితే భవన నిర్మాణానికి అక్కడ ఉన్న చెట్లు అడ్డు వస్తాయని కాంట్రాక్టర్ వాటిని తొలగించాడు. అయితే ఆ తర్వాత పనులు పునాదిలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. కలెక్టర్, మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల సమావేశాల కోసం రెవెన్యూ అధికారులు ప్రైవేట్ కళ్యాణ మండపాలకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు అద్దె చెల్లించి తీసుకుంటున్నారు. దీంతో సమావేశం పెట్టాలంటేనే రెవెన్యూ అధికారులు భయపడుతున్నారు. మరో వైపు నిధులున్నా, అన్ని అనుమతులు ఉన్నా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనే నిర్మాణం చేపట్టాల్సి ఉంది. శంకుస్థాపన చేసిన పునాది గుంతలో పిచ్చి చెట్లు పడ్డాయి. దీంతో ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమానికి వచ్చే ప్రజలు, అర్జీదారులు ఉన్న కాసింత ఖాళీ స్థలంలోనే వేచి ఉండి లోపలికి వెళ్లి అర్జీలు ఇస్తున్నారు. మరో వైపు నిర్మాణం పూర్తయితే తమకు అద్దె భాద తప్పిపోతుందని రెవెన్యూ అధికారులు భావిస్తుండగా నిర్మాణ పనులు అడుగు ముందుకు పడటం లేదు. నూతన భవనం నిర్మించాలంటే ముందు పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు ఉంది. దాన్ని తొలగించాలంటే జిల్లా అధికారుల అనుమతి అవసరం. దీంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని తెలిసింది. నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారో వేచి చూడాల్సిందే.


నాడు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు(ఫైల్)

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

ఒంగోలు: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.శివాజీ, కార్యదర్శి డి.కిరణ్మయి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.కోటి సూర్యనారాయణ, హెచ్‌ఎం పద్మావతి, సీహెచ్ రామకృష్ణారావు, వి.ఆంజనేయులు, పీఈటీ సోమినేని సురేష్ పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రతిమ, మస్తాన్‌బీ, రమణయ్య, శంకర్రావు, వెంకటేశ్వర్లు, సురేష్ వ్యవహరించారు.


యోగా పోటీల్లో ప్రతిభ చాటుకుంటున్న చిన్నారులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులకు ప్రశంస పత్రాలు

ఎంపికైన క్రీడాకారులు వీరే

8–10 సంవత్సరాల విభాగం

బాలురు: సీహెచ్ జస్వంత్–నేరేడుపల్లి(ప్రథమ), సీహెచ్ నాగేంద్ర–నేరేడుపల్లి(ద్వితీయ)

బాలికలు: ఎస్.మోక్షిత–పెదచెర్లోపల్లి(ప్రథమ), సీహెచ్ మానస– పెదచెర్లోపల్లి(ద్వితీయ)

10–12 సంవత్సరాల విభాగం

బాలురు: ఎ.తేజచరణ్– చందలూరు(ప్రథమ), ఎన్.నిరీక్షణ్‌రావు–చందలూరు(ద్వితీయ)

బాలికలు: ఎన్.రత్నకుమారి–చందలూరు(ప్రథమ), ఎం.షణ్ముఖ–ఒంగోలు(ద్వితీయ)

12–14 సంవత్సరాల విభాగం

బాలురు: ఎం.వెంకటేష్–చందలూరు(ప్రథమ), ఎం.షణ్ముఖ–ఒంగోలు(ద్వితీయ)

బాలికలు: ఎస్.శృతి–చందలూరు(ప్రథమ), ఎ.లిఖిత–చందలూరు(ద్వితీయ)

14–16 సంవత్సరాల విభాగం:

బాలురు: టి.సందీప్‌వర్మ–ఒంగోలు(ప్రథమ), వై.కళ్యాణ్ రామ్–మద్దిపాడు(ద్వితీయ)

బాలికలు: వి.రజని–పామూరు(ప్రథమ), కె.శరణ్య–ఒంగోలు(ద్వితీయ)

18–21 సంవత్సరాల విభాగం:

పురుషులు: సీహెచ్.శ్రీధర్–ఒంగోలు(ప్రథమ), కె.ప్రణీత్–ఒంగోలు(ద్వితీయ)

మహిళలు: ఎస్.సాయిచందన–ఒంగోలు(ప్రథమ), ఎ.ఉదయ సాయి శ్వేత–ఒంగోలు(ద్వితీయ)

21–25 సంవత్సరాలు:

పురుషులు: కె.శివకోటిరెడ్డి–కోరలమడుగు(ప్రథమ)

35–45 సంవత్సరాల విభాగం:

మహిళలు: బి.ప్రశాంతి–ఒంగోలు(ప్రథమ)

45 సంవత్సరాల పైన:

పురుషులు: కె.శంకరరావు–ఉప్పుగుండూరు(ప్రథమ), ఎస్‌వీ రమణయ్య–కనిగిరి(ద్వితీయ)